
ఆధునిక యుగంలో అవసరాలు పెరిగాయి. సమాజం మరింత విస్తరించింది. ఒకే చోట పాతుకుపోతే పని సాఫీగా సాగే పరిస్థితులు లేవు. స్వయం ప్రతిపత్తిగా మారితేనే గౌరవంగా ఉంటుంది. సమస్యలకు పరిష్కారం కూడా సత్వరమే కలుగుతుందనే భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని ధైర్యంగా ముందడుగేసిన ప్రముఖ వ్యాపారవేత్త **రామా చంద్రమౌళి,** మాతృసంస్థ చాంబర్ మంచి ప్రత్యేక శాఖగా విస్తరించాలనే సంకల్పంతో ముందుకెళ్లారు. ఆయన ఆలోచనల నుంచే వరంగల్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పురుడు పోసుకుంది. 1994లో వరంగల్ హంటర్ రోడ్డు బొందివాగు ప్రాంతంలో స్థలాన్ని కొనుగోలు చేసి అసోసియేషన్ పేరున రిజిస్ట్రేషన్ జరిపించారు. ఇలా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వ్యాపార రంగంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఘన చరిత్ర **రామా చంద్రమౌళి**కి దక్కింది.



# వ్యాపార దిగ్గజం రామా చంద్రమౌళి



- గడ్డం కేశవమూర్తి

**అసోసియేషన్ స్థాపనకు అంకురార్పణ**

**వ్యాపార విస్తరణలో తనదైన ముద్ర...**







## ఐక్యత కోసం అసోసియేషన్..

ఒంటరిగా ఉంటే బలం సన్నగిల్లుతుంది. తోడుగా సాగితే వర్ధిల్లుతుంది అనే విషయాన్ని రామా చంద్రమౌళి చిన్నప్పుడే గ్రహించారు. అదే ఆలోచనతో ఉమ్మడి జిల్లాలోని రైస్ మిల్లర్లందరినీ ఒకే వేదికపైకి తీసుకురావడానికి నిర్ణయించుకున్నారు. పెరుగుతున్న పరిధిని కాపాడుకుంటూ, చాంబర్ లోనే కొనసాగుతూ ప్రత్యేక విభాగానికి పావులు కదిపారు. జిల్లాలోని రైస్ మిల్లుల యజమానులను పలు విడుతలుగా సమావేశ పరిచి ఐక్యతపై సమాలోచనలు చేశారు. తన అనుభవాన్ని వారితో పంచుకుంటూ మున్ముందు ఎదురు కాబోయే పరిణామాలు, కలిసి కట్టుగా ఉండాల్సిన ఆవశ్యకతను వారికి వివరించారు. అందరిని సమన్వయపరచి అసోసియేషన్ ఏర్పాటుకు బీజం వేశారు. ఈ క్రమంలోనే మహబూబాబాద్, తొర్రూరు, నర్సంపేట, పరకాల, ములుగు తదితర ప్రాంతాల్లోని వ్యాపారులందరినీ ఒక్కటి చేసి 1994లో వరంగల్ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషను ఏర్పాటు చేశారు. జిల్లాల విభజన తర్వాత ఇప్పుడు ఏ జిల్లాకు ఆ జిల్లా వేర్వేరుగా మారినా తమ మంచిచెడులను అన్ని ఒకే వేదికపై పంచుకుంటున్నాయి.

## కార్యాలయ సముదాయానికి ప్రణాళికలు..

రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేస్తేనే సరిపోదు. దానికి కావాల్సిన కార్యాలయం, అంతా కలుసుకోవడానికి ఓ శాశ్వత వేదిక ఉండాల్సిన అవసరాన్ని గుర్తించిన రామా చంద్రమౌళి ఆ దిశగా ముందడుగు వేశారు. అందులో భాగంగా ప్రస్తుతం కార్యాలయం ఉన్న ప్రాంతాన్ని పరిశీలించి అప్పటి భూ యజమాని సిరిమళ్ల జగన్నాథంలో మంతనాలు జరిపారు. అవి ఫలించడంతో రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పేరిట రెండెకరాల భూమిని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించారు. బొందివాగులో ఉన్న ఆ ప్రాంతాన్ని చదును చేసి, ఎత్తు పెంచి భవన నిర్మాణానికి అనువుగా మలిచేందుకు చంద్రమౌళి తీవ్రంగా శ్రమించారు. భద్రకాళికి చెరువుకు వరద పోటెత్తే ప్రాంతం కావడంతో భద్రకాళి ఫోర్ఫోర్కు (అడ్డుకట్ట) ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందని ఆయన అడ్వైజరీ కమిటీలో కొనసాగిన కాలంలో చర్చించారు.

## కలిసికట్టుగా...

వరంగల్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్థాపించిన తర్వాత దాని అభివృద్ధిలో రామా చంద్రమౌళి మరింత కీలక భూమిక పోషించారు. 1994 నుంచి 2001 వరకు వ్యవస్థాపక అధ్యక్షుడిగా కొనసాగిన ఆయన ఎల్లవేళలా అసోసియేషన్ అభివృద్ధి కోసం పరితపించారు. ఆయన అలా కాపాడిన భూమే ఆ తర్వాత వచ్చిన అధ్యక్షులు అన్నపూర్ణేశ్వరి గార్డెన్గా తీర్చిదిద్దారు. బ్యాంకెట్ ఏసీ హాల్, శ్రీ భక్తాంజనేయ స్వామి గుడి నిర్మాణం జరిపించడానికి ఉపయోగపడిందని అసోసియేషన్ పెద్దలంతా చెబుతారు. 300 మంది పైచిలుకు సభ్యులతో ప్రారంభమైన అసోసియేషన్ జిల్లాల పునర్విభజనతో ప్రస్తుతం సభ్యుల సంఖ్య 140కే పరిమితమైనా. ఉమ్మడి జిల్లాలోని ఏ ప్రాంతానికి చెందిన వ్యాపారైనా ఈ అసోసియేషన్ కేంద్రంగానే మంతనాలు జరుపుతూ ముందుకెళ్తున్నారు.

## సాధించినవి ఎన్నో..

రైస్ మిల్లులు అంటేనే నిత్యం కూలీలు, వాహనాలు, విద్యుత్ వినియోగం, ట్రాన్స్ పోర్టేషన్ వంటి ఎన్నో అంశాలతో ముడిపడిన వ్యవహారం. ఎక్కడ ఏ చిన్న సమస్య ఉత్పన్నమైనా భారీ నష్టాన్ని మూటగట్టుకోవాల్సి ఉంటుంది. మరీ ముఖ్యంగా మిల్లులకు నిరంతరాయంగా కరెంట్ సరఫరా తప్పనిసరి, అందుకే మిల్లులు ఎక్కువగా వెలిసిన ప్రాంతాలకు కరెంట్ సరిపడా ఉండేలా రామా చంద్రమౌళి సౌకర్యాల కల్పనకు కృషి చేశారు. ఈ క్రమంలోనే సుమారు 32 సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయించి వ్యాపారులెవరూ కరెంట్ కోతలతో ఇబ్బందులు పడకుండా వసతులు కల్పించారు.

## వ్యాపారంలోకి ప్రవేశం..

రామా చంద్రమౌళి తండ్రి అంబయ్య పదో ఏటనే వ్యాపార రంగంలోకి అడుగుపెట్టారు. ఐరన్ వ్యాపారం చేసేవారు. తండ్రి స్ఫూర్తితోనే రామా చంద్రమౌళి కూడా 1968లో తన 20వ ఏటలోనే వ్యాపారంలోకి అరంగేట్రం చేశారు. నర్సంపేట శివారు రాజీపేటలో రైస్ మిల్, వరంగల్లో ఐరన్ వ్యాపారం చూసుకునే వారు. ధర్మారం దగ్గరలోని వంశీ పారాబాయిల్డ్ రైస్ మిల్లును కొనుగోలు చేసి వ్యాపారం చేశారు. అనంతరం మంచిర్యాల జిల్లా ఇందారం గ్రామంలో ఓం ఇండస్ట్రీస్ (పారాబాయిల్డ్ యూనిట్), శ్రీ బాలాజీ స్టీల్స్యాట్ ఇండస్ట్రీస్ స్థాపించి వ్యాపారాన్ని విస్తరించారు.

## రాజకీయంగా పలుకుబడి..

రామా చంద్రమౌళికి రాజకీయంగా మంచి పలుకుబడి ఉంది. అప్పటి ఎంపీగా చందుపట్ల జంగారెడ్డిని బీజేపీకి ప్రపోజ్ చేసింది చంద్రమౌళియే. నేతలందరితో మంచి సంబంధాలను కొనసాగించిన లౌక్యం ఆయనది. రాజకీయ విశ్లేషణలో పట్టున్న వ్యక్తి కావడంతో బడా నేతలంతా ఆయన వద్దకు క్యూ కట్టేవారు. తమ ఆలోచనలు ఆయనతో పంచుకొని ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటే బాగుంటుందో విచారించేవారు. అయోధ్య రామ జన్మ భూమిలో రామ మందిర నిర్మాణానికి ఆలోచన చేసిన వారిలో రామా చంద్రమౌళి ఒకరు. అప్పట్లోనే ప్రత్యేక ఇటుకలతో తరలివచ్చి రామ మందిర నిర్మాణానికి సహరించాలని పిలుపునిచ్చిన వాజ్పేయ్, అద్వానీకి సలహా ఇచ్చిన వారిలో చంద్రమౌళి ప్రముఖుడిగా పేర్కొనవచ్చు.

## చాంబర్‌కు చేయూత..

మాతృసంస్థ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీకి వరంగల్ రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నేటికీ చేదోడువాదోడుగా నిలుస్తూనే ఉంది. ఆ మాటకొస్తే చాంబర్కు ఆ స్థలాన్ని నలుగురు రైస్ మిల్లర్లే కొనిచ్చారంటే వారికి మాతృసంస్థపై ఎంతటి మమకారమో అర్థం చేసుకోవచ్చు. అలాగే చాంబర్ మొదటి అంతస్తును కూడా అసోసియేషన్ ఎ తరఫునే నిర్మించి బహుమతిగా అప్పగించారు. ఇప్పటికీ చాంబర్లో వరంగల్ రైని మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, అన్ని కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుందంటే కేవలం సౌందర్ అధ్యక్షుడు రామా చంద్రమౌళి చొరవే అని చెప్పడంలో అతిశయోక్తి లేదు.



## బాల్యం.. కుటుంబం..

రామా చంద్రమౌళి 1948 నవంబర్ 9న రామా వరలక్ష్మి- అంబయ్య దంపతులకు వరంగల్ రామన్నపేటలో జన్మించారు. తల్లిదండ్రులకు కలిగిన ఆరుగురు సంతానంలో నలుగురు అన్నదమ్ములు (రామా సుదర్శన్, రామా ఉపేందర్, చంద్రమౌళి), ఇద్దరు అక్కాచెల్లెళ్లు, తండ్రి అంబయ్య మొదటి నుంచే వ్యాపార రంగంలో అందెవేసిన చేయి. హెూల్సేల్ ఐరన్ వ్యాపారం చేస్తూ పిల్లలను ప్రయోజకులను చేశారు.

రామా చంద్రమౌళి బాల్యమంతా వరంగల్ రామన్నపేటలోనే సాగింది. ఆంధ్రవిద్యాభివర్ధినిలో ప్రాథమిక విద్యాభ్యాసం దేశారు. అనంతరం విశాఖపట్టణంలో ఇంగ్లిష్ మీడియంలో ఆంధ్ర మెట్రిక్యులేషన్ పూర్తి చేశారు. అప్పట్లో వరంగల్లో ప్రతిష్టాత్మకమైనా రామకృష్ణ ట్యుటోరియల్ కాలేజీలో విదాభ్యాసం చేశారు.

## వివాహం.. పిల్లలు..

రామా చంద్రమౌళికి 1964లో వివాహమైంది. నలుగురు సంతానం. భార్య రామా ఇందిర, కుమారులు రామా శ్రీధర్, రామా గోపికృష్ణ, కూతుళ్లు రామా శ్రీవిద్య (అమెరికా), శ్రీదేవి ఉన్నారు. పిల్లలందరినీ ఉన్నతంగా చదివించి ప్రయోజకులను చేశారు. కుమారులిద్దరితోపాటు కూతురు శ్రీవిద్య అమెరికాలో ఉన్నతోద్యోగాలు చేస్తున్నారు. మరో కూతురు శ్రీదేవి వెల్టి రాజమౌళి కుమారున్ని వివాహం చేసుకుని వరంగల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం పండ్ల వ్యాపారం చేస్తున్నారు.